క్లుప్తంగా

గుల్లలపాలెం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



ఆనంద్‌కుమార్‌ను స్వాగతిస్తున్న ముస్లింలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మసీదులో బుధవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అతిథిగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులను ఆప్యాయంగా పలకరించి, ఆలింగనం చేసుకున్నారు. రంజాన్ ఉపవాస దీక్ష ప్రార్థనల్లో పాల్గొవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జ్ పిలక రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తరలించే వాహనాలు ప్రారంభం



తోపుడుబళ్లను ప్రారంభిస్తున్న సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డుకు 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో అందించిన వ్యర్థాలను తరలించే కొత్త తోపుడు బళ్లను బుధవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మెరుగైన పారిశుధ్యం అందించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. ఇరుకు వీధులు, సందుల్లో తోపుడు బళ్ల ద్వారా తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డ్‌కు వ్యాన్ సాయంతో తరలిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీ, శానిటేషన్ సెక్రటరీ స్నేహ, పద్మ, కుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు ప్రభుత్వ సహకారం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మల్కాపురం: యువత చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సూక్ష్మ,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు, వాటి అభివృద్ధికి తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఓ హోటల్‌లో బుధవారం మన షూష్ బ్రోచర్, ప్రొడక్ట్‌ను మంత్రి చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో తొలిసారి షూష్ పరిశ్రమ ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో మన షూష్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థిని బలవన్మరణం

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలేనికి చెందిన సాబి లావణ్య అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వెంకోజీపాలేనికి చెందిన శ్రీను, అతని భార్య కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె లావణ్య ప్రస్తుతం విజయనగరం ఎంఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తల్లిదండ్రులు బుధవారం పనులకు వెళ్లగా లావణ్య ఇంట్లోనే ఉంది. వారు వచ్చి చూసేసరికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. ఎంవీపీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే లావణ్య తాను ఠాగూర్ అనే యువకుణ్ని ప్రేమిస్తున్నట్లు, అతనితో కలిసి జీవించే అవకాశం లేకనే చనిపోతున్నట్టు సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు.

కనీస వసతులు శూన్యం!

- మరుగుదొడ్లకు తాళాలు
- సేద తీరేందుకు కానరాని విశ్రాంతి షెడ్లు



తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు



విధులు బహిష్కరించిన స్థానికేతర కార్మికులు (ఫైల్)

మల్కాపురం: పని చేసే చోట కార్మికులకు కనీస వసతులు కల్పించాలని చట్టం చెబుతున్నా.. యామాన్యాలకు పట్టడం లేదు. దీంతో కార్మికులు దుర్భర స్థితిలో పని చేస్తున్నారు. సౌకర్యాలు కల్పించాలని ఆందోళన చేపట్టినా పట్టించుకునే నాధుడు లేరని కార్మికులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. మరుగుదొడ్లు ,మంచీ నీటి సదుపాయం గానీ,విశ్రాంతి షెడ్లు లేవు. ఎండ వేడి,వడగాడ్పులతో కార్మికులు విల విల్లాడుతున్నారు. వసతులు కల్పించాలని ఆందోళన చేపట్టినా కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. పొరపాటున కార్మికుడికి ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర చికిత్స చేసేందుకు వైద్య సిబ్బంది లేరు. హెచ్‌పీసీఎల్ ఆస్పత్రికో లేదా ఈఎస్‌ఐ, ప్రైవేట్ వైద్యశాలకో పంపించాల్సిన పరిస్థితి. సమస్యను దృష్టిలో పెట్టుకుని తమకు న్యాయం జరిగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



షాపుల్లో తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్న సెక్రటరీ, సచివాలయ సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశాల మేరకు బుధవారం సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 53వ వార్డు మర్రిపాలెం మెయిన్ రోడ్డు షాపుల్లో, 297 సచివాలయం పరిధి మహారాణి వీధి–1లో సచివాలయ సిబ్బందితో కలిసి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ తులసీ, సెక్రటరీ పాలవెల్లి తనిఖీలు చేశారు. షాపుల్లో వాడుతున్న ప్లాస్టిక్‌ను స్వయంగా పరిశీలించారు. ప్లాస్టిక్ వాడిన వారిపై జరిమానా విధించారు. పలు షాపుల్లో ట్రేడ్ లైసెన్సులు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించారు. షాపుల ముందు ట్విన్ బిన్లు కచ్చితంగా ఉండాలని, తడి, పొడి చెత్త వేరు చేసి వాటిలో వేయాలని వ్యాపారులకు సూచించారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానాలు విధిస్తున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్, పారిశుధ్య నిర్వహణ విషయంలో రాజీ పడేది లేదని, నిబంధనలను వ్యతిరేకిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వలంటీర్లు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగుల వినియోగంతో మేలు



ధర్మానగర్‌లోని పూల దుకాణంలో ప్లాస్టిక్ సంచులను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో బుధవారం జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ పర్యటించారు. దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారిపై అపరాధ రుసుం విధించాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డులోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించని శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బందిపై జెడ్సీ మండిపడ్డారు. కాలుష్య కారక ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న దుకాణ యాజమానులకు క్లాత్ సంచుల వినియోగంపై ఆయన అవగాహన కల్పించారు. వార్డులోని గెడ్డలు, కాలువలు, రహదారులు అధ్వానంగా ఉండటంతో సిబ్బందిపై మండిపడ్డారు. తడి, పొడి చెత్త సేకరణపై వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డు కార్యాలయంలో సిబ్బంది రికార్డులను జెడ్సీ పరిశీలించారు.

ఎన్‌ఏడీలో భారీ రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న కార్మికులు

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా నేవల్ ఆర్మమెంట్ డిపో ఆడిటోరియంలో బుధవారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని చీఫ్ జనరల్ మేనేజర్ నివారి ప్రారంభించారు. వర్క్స్ కమిటీ, కార్మికులు సమష్టిగా రక్త దానశిబిరం నిర్వహించారన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని నివారి అన్నారు. సామాజిక కార్యక్రమాల్లో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. సుమారు 200 మంది కార్మికులు రక్తదానం చేశారు.

ఫొటోల అప్పారావు సేవలు ఎనలేనివి



ఫొటోల అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిసున్న నాయకులు

సింధియా: ఆదర్శ హేతువాది, ఛాయా చిత్రకారుడు అయిన ఫొటోల అప్పారావు సేవలు ఎనలేనివని షిప్‌యార్డ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు అన్నారు. సింధియాన్యూకాలనీలోని బాలకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం అప్పారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1972–2002 అతను తీసిన ఫొటోలు ఎన్నో పత్రికల్లో ఆలోచింపజేసేవిధంగా అచ్చయ్యాయన్నారు. గాంధీగ్రామం గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు మూడు సార్లు చదివిన పాఠక పిపాసి ఫొటోల అప్పారావు అని, ఆయన మృతి పాఠక లోకానికి తీరని లోటు అని కొనియాడారు. కార్యక్రమంలో తుంపాల శ్రీరామమూర్తి, మాస్టారు ఆడారి భాస్కరరావు, ఎస్వీ రమణ, సతీష్, చంటి బాబు, ఎంవీ రమణమూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



వంశీ మృతదేహం

ఆరిలోవ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆరిలోవలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరిలోవ ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టీబీసీ పాయింట్ వద్ద నివాసముంటున్న రాపర్తి వంశీ(33) ఇసుకతోట సమీప విష్ణు హోండా షోరూంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జ్యోతి ఓ బంగారం ఫైనాన్స్ సంస్థలో పని చేస్తోంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. ఎప్పటిలాగే బుధవారం డ్యూటీకి వెళ్లిన వంశీ.. షోరూం నుంచి ఉదయం 10 గంటలకు వేరే బైక్‌తో బయటకు వచ్చి తిరిగి షోరూంకు వెళ్లలేదు. దీంతో షోరూం మేనేజర్ ఉదయం 11.30 గంటలు, మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అతని భార్య జ్యోతి కూడా డ్యూటీ నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు ఇంటికి వచ్చింది. తలుపునకు లోపల నుంచి గడియపెట్టుకొని ఇంట్లో ఎవరో ఉండడాన్ని ఆమె గమనించింది. తలుపులు ఎంతకొట్టినా తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తాళం పగలుగొట్టి చూసేసరికి ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వంశీ వేలాడుతున్నాడు. దీంతో ఆమె కన్నీటిపర్యంతమై బంధువులకు సమాచారం అందించింది. ఈ విషయం తెలుసుకున్న ఆరిలోవ సీఐ సోమశేఖర్, ఎస్ఐ అనిల్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాల గురించి ఆరా తీశారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'



59వ వార్డులో లబ్ధిదారులకు కరపత్రాలు అందిస్తున్న కన్వీనర్ సంపత్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్ మెన్ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. సచివాలయ కన్వీనర్ సంపత్‌కుమార్, భూపతి తదితరులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల రూపంలో ప్రజలు పొందిన లబ్ధిని, మేలును గురించి వివరించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో గృహసారథులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా నూకాంబిక అమ్మవారి నెల పండగ



అమ్మవారి సారె ఊరేగిస్తున్న మహిళలు

సింధియా : జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని నూకాంబిక అమ్మవారి నెల పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం భారీ బాణసంచా, తప్పెటగుళ్లతో నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతి నగర్‌లోని సంపత్ వినాయక ఆలయ 19వ వారికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అతిథులు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, పార్టీ 59వ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్‌లు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్నసమారాధనను ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించి భక్తులు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో నాయకులు రేవళ్ల సత్యనారాయణ, జి.ఎస్.రావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి



పనులపై సూచనలిస్తున్న కార్పొరేటర్ చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ గల్లా చిన్నా విస్తృతంగా పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వార్డు వాసులు గతంలో ఆయనకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయా ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పుక్కల కృష్ణ, అమెరికా శ్రీను, రాజా, బొండా కృష్ణ, పుక్కల రాజారావు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు



రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గోపాలపట్నం: గోపాలపట్నం సుకన్యా సినిమా హాల్ ఖాళీ స్థలంలో ముస్లింలకు బుధవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాస ప్రార్థనల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ మాసంలో ముస్లింలు ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలను పాటిస్తారని చెప్పారు. ముస్లింలను ఆయన ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌ను గజమాలతో ముస్లింలు ఘనంగా సత్కరించారు. ముందుగా ముస్లింలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, చుక్క ప్రసాదరెడ్డి, అప్పలస్వామి, కార్పొరేటర్ పి.వి.సురేష్, స్థానిక నాయకులు జి.మురళీకృష్ణ, అయితంశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

హిమాచల్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్‌లో సీసీ రోడ్డు, కాలువ నిర్మాణ పనులకు బుధవారం ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలో సుమారు రూ.27 లక్షలతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, రేవళ్ల సత్యనారాయణ, నమ్మి గౌరీశ్వరరావు, కృష్ణాప్పరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యమాంబ తొలేళ్ల సంబరం



అమ్మవారి ప్రతిమలు ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ముత్యమాంబ

కంచరపాలెం: ముత్యమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం బుధవారం వైభవంగా జరిగింది. గవర కంచరపాలెం గౌరీ యువసేన వెల్ఫేర్ సొసైటీ, గ్రామాభ్యుదయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాలమరశెట్టి నగేష్, పీలా అవినాష్ ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి నగర ప్రాంతాల మీదుగా అమ్మవారి ఉత్సవ ప్రతిమల ఊరేగింపు కనుల పండువగా సాగింది. భక్తులు తలపై ప్రతిమలను మోస్తూ జగదాంబ కూడలి, అల్లిపురం, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల మీదుగా కంచరపాలెం పుట్టబంగారం అమ్మవారి మూలవిరాట్ వద్దకు చేర్చారు. పలువురు ప్రముఖులు అమ్మవారి ఘటాలను తలపై ఉంచి మొక్కు తీర్చుకున్నారు. పాలకవర్గ సభ్యులు వేగి రమణ, మళ్ల రామకృష్ణ, పి.అప్పారావు, మళ్ల సాంబశివ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..

ఘటాల ఊరేగింపులో ఒడిశాకు చెందిన బ్యాండ్ సింగారి మేళ, ధూమ్‌ధడాకాలు, తప్పెటగుళ్లు, విజయనగరం పులివేషాలు, వివిధ జంతువుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ ధూపదీప నైవేద్యాలు, సమర్పిస్తూ, ప్రతిమలకు హారతులిస్తూ భక్తులు ముందుకు సాగారు.

నేడు ప్రధాన జాతర

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో వెలసిన ముత్యమాంబ ఆలయం వద్ద గురువారం ప్రధాన జాతర నిర్వహించన్నారు. దీనికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, శీతల పానీయాలు అందించేందుకు చలివేంద్రాలు సిద్ధం చేశారు. భక్తులు మాస్కులు ధరించి ప్రధాన జాతరకు తరలిరావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

సింహగిరికి గంధం అమావాస్య తాకిడి

- భారీగా చేరుకున్న భక్తులు



పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సింహాచలం: గంధం అమావాస్య పురస్కరించుకుని ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెద్ద ఎత్తున గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు బుధవారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో చందనోత్సవం ముందు వచ్చే అమావాస్యను గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. కుటుంబాలతో కలిసి సింహగిరికి తరలివస్తారు. ముందు రోజు చేరుకుని వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తారు. వంటలు వండుకుని పంక్తి భోజనాలు చేస్తారు. ఈ సారి గంధం అమావాస్య గురువారం కావడం, అమావాస్య బుధవారం ఉదయం 11గంటల నుంచే రావడంతో మధ్యాహ్నం నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. రాత్రికి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. భక్తులతో వరాహ పుష్కరిణి మార్గం అంతా కిటకిటలాడింది.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి కన్నుమూత



కృష్ణమూర్తి(ఫైల్)

ఆరిలోవ: సుదీర్ఘ కాలం పాటు సీపీఎంలో సేవలు అందించిన వి.కృష్ణమూర్తి(67) బుధవారం వేకువజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆరిలోవలోని ఆయన నివాసంలో మంగళవారం అర్థరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించే సమయానికే ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆరిలోవ తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని కృష్ణమూర్తి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.మణి, నరేంద్రకుమార్, శంకరరావు, సూర్యమణి, రంగమ్మ, సీపీఐ జిల్లా నాయకుడు రెహమాన్ తదితరులు అంజలి ఘటించారు. సంస్మరణ సభలో కృష్ణమూర్తి చేసిన పోరాటాను నాయకులు కొనియాడారు. పోరాట పటిమ ఉన్న మంచి వ్యక్తిని సీపీఎం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ సంస్మరణ సభలో కన్నీరు పెట్టుకున్నారు. కృష్ణమూర్తికి భార్య అన్నపూర్ణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఏఎంసీకి పార్థివదేహం అప్పగింత

కృష్ణమూర్తి ఆలోచనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం అప్పగించడానికి అంగీకరించారు. ఇందులో భాగంగా అతని నేత్రాలు ఎల్వీపీ కంటి ఆస్పత్రికి దానం చేశారు. అనంతరం పార్థివ దేహానికి అంతిమ యాత్ర నిర్వహించి, కుటుంబ సభ్యులు, సీపీఎం, సీపీఐ నాయకులు ర్యాలీగా తీసుకెళ్లి ఏఎంసీకి అప్పగించారు.